
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 30 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి రామ దివాకర్, శారద రాణి దంపతులు(హైదరాబాద్) గురువారం రూ.50 వేలు విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగులో భాగంగా బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,530, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
39.5°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.5	26.5
కాకినాడ	36.5	28.4
అమలాపురం	36.0	27.0

న్యూస్‌రీల్

కుకింగ్, క్యాటరింగ్ సంఘ అధ్యక్షుడిగా సూరిబాబు



కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న సంఘీయులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మంటపంలో జిల్లా కుకింగ్ అండ్ క్యాటరింగ్ సంఘం తొలిసారిగా ఏర్పాటైంది. జిల్లాలోని కుకింగ్, క్యాటరింగ్ వృత్తిదారులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సలాది సూరిబాబు, గౌరవాధ్యక్షులుగా గుడివాడ రాంబాబు, బోణం కృష్ణ, కార్యదర్శిగా రావూరి కిరణ్, కోశాధికారిగా వేమన నరసింహరావు, ఉపాధ్యక్షుడిగా బోణం వీరబాబు ఎన్నికయ్యారు. జిల్లాకు తొలిసారిగా ఏర్పాటైన నూతన సంఘం అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలోని అన్ని పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో కుకింగ్, క్యాటరింగ్ సంఘాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 700 మందికి పైగా ఉన్న వంట, భోజన పదార్థాల తయారీ వృత్తిదారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భీమేశ్వరునికి వెండి పాదుకల సమర్పణ



ఈఓ తారకేశ్వరరావుకు వెండి పాదుకలు అందజేస్తున్న వీరబాబు దంపతులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామికి అదే గ్రామానికి చెందిన గుండుబోయిన చిన వీరబాబు, దేవీ దంపతులు గురువారం 240 గ్రాముల వెండి పాదుకలు (శఠగోపం) ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు చేతుల మీదుగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కళ్లేపల్లి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కిక్కిరిసిన సిద్ధివినాయకాలయం



మాఢ వీధుల్లో ఊరేగుతున్న విఘ్నేశ్వర స్వామివారు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ వేదపండితులు స్వామివారికి విశేష పూజలు జరిపారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని మాఢవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో వాషింగ్టన్‌కు చెందిన చిన్నారి నలిని కృష్ణన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ సంగీతం భక్తులను అకట్టుకుంది. మండలంలోని నల్లచెరువు గ్రామంల్లో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

సాగు చేయమంటారా? వద్దంటారా?

సాక్షి అమలాపురం: 'గత ఏడాది సాగు సమ్మె ప్రకటిస్తే జిల్లా అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికీ అవే సమస్యలు నెలకొన్ని ఉన్నాయి. మమ్మల్ని ఖరీఫ్ సాగు చేయమంటారా? వద్దంటారా?' అని కోనసీమ రైతు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. అమలాపురంలో సమితి ప్రతినిధులు గురువారం పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం అధ్యక్షతన సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ గత ఏడాది సాగు సమ్మె ప్రకటిస్తే అధికారులు మా వెంట పడి సాగు చేయమని అడిగారని, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారన్నారు. ఇప్పుడు ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదని విమర్శించారు. డ్రైన్ల ఆధునీకరణకు 44 పనులకు టెండర్లు పిలిచామని చెప్పారని, కాని పనులు చేయలేదన్నారు. జూన్ 1న పంట కాలువలకు నీరు విడుదల చేసినా ఇప్పటికీ చాలా చేలకు నీరందలేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సాగు చేయాలో? వద్దో ప్రభుత్వం ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. సమితి ప్రతినిధులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, దామిశెట్టి చంటి, రంబాల బోసు, వేగేశ్న సూర్యనారాయణరాజు, చిక్కం పెద్దబ్బులు పాల్గొన్నారు.



మండపేటలో వరి నాట్లు

సామజవరిగమన



ఎరువులు కలుపుతున్న రైతు (ఫైల్)

- జిల్లాలో జోరందుకున్న తొలకరి పనులు
- సీజన్ మొత్తానికి అవసరమైన ఎరువులు 40,712 మెట్రిక్ టన్నులు
- జూలై నెలకు కావలసినవి 10,180 మెట్రిక్ టన్నులు
- ముందుగానే సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- ఆర్‌బీకే, మార్క్‌ఫెడ్, సొసైటీలు, డీలర్ల ద్వారా పంపిణీ

మండపేట: జిల్లాలో వ్యవసాయ పనులు జోరందుకుంటున్నాయి. ముందుగానే కాలువలకు నీరు విడుదల చేయడం, తొలకరి వర్షాల రాకతో సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. సీజన్‌కు అవసరమైన ఎరువులను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఖరీఫ్ మొత్తానికి 40,712 ఎం.టీ. (మెట్రిక్ టన్నులు) ఎరువులు అవసరం కాగా జూలై నెలకుగాను 10,180 ఎంటీ ఎరువులు కావాల్సి ఉంది. అవసరమైన ఎరువులను ఇప్పటికే వ్యవసాయశాఖ ఆర్‌బీకేలు, మార్క్‌ఫెడ్, సొసైటీలు, డీలర్ల వద్ద సిద్ధం చేసింది.

తుపానుల ముప్పు తప్పించడానికి..

జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 1,74,275 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగనుంది. నవంబర్‌లో తుపానుల బెడదను తప్పించడంతో పాటు మూడవ పంటకు మార్గం సుగమం చేసేందుకు వ్యవసాయశాఖ గత ఏడాది నుంచి ముందస్తు సాగు చేపడుతోంది. ఈ మేరకు రెండు వారాల ముందుగానే జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేశారు. జూలై రెండవ వారం నాటికి నాట్లు పూర్తి చేయడం ద్వారా అక్టోబర్ నెలాఖరుకు కోతలు పూర్తి చేయవచ్చు. దీనివల్ల నవంబర్‌లో వచ్చే తుపానుల ముప్పు నుంచి తొలకరి పంటను కాపాడుకునే వీలుంటుంది. డిసెంబర్ చివరి నాటికి రబీ నాట్లు వేసుకుని మార్చి నెలాఖరుకు కోతలు పూర్తి చేసుకుంటే మూడవ పంటగా అపరాల సాగుకు వీలు కలుగుతుంది. ఆ దిశగా వ్యవసాయ అధికారులు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 45,000 ఎకరాలకు నారుమడులు పూర్తయ్యాయి. ఇంజన్లపై ముందుగా నారుమడులు వేసిన మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో నాట్లు మొదలయ్యాయి. రెండు వేల ఎకరాల్లో నాట్లు పడగా, 600 ఎకరాల్లో వెదజల్లారు. ఈ సీజన్‌లో దాదాపు 30 శాతం విస్తీర్ణంలో వెదజల్లు సాగు జరుగుతుందని అంచనా.

సిద్ధంగా ఎరువులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు మొత్తం 40,712 ఎం.టీ. ఎరువులు అవసరం కాగా వీటిలో యూరియా 10,270 ఎం.టీ., డీఏపీ 4,180 ఎం.టీ., కాంప్లెక్స్ ఎరువులు 24,239 ఎం.టీ., పొటాష్ 889 ఎం.టీ., ఎస్ఎస్‌పీ 1,134 ఎం.టీ. అవసరమవుతాయి. జూలై నెలకు గాను ఆయా రకాలకు చెందిన 10,180 ఎం.టీ. ఎరువులు అవసరం కాగా జిల్లాలో గోడౌన్ సదుపాయం కలిగిన 81 ఆర్‌బీకేల వద్ద 1,200 ఎం.టీ. ఎరువులు అందుబాటులో ఉంచగా, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 4,030 ఎం.టీ., సొసైటీల వద్ద 2,200 ఎం.టీ., హోల్‌సేల్ డీలర్ల వద్ద 6,000 ఎం.టీ., కంపెనీ గోడౌన్ల వద్ద 21,000 ఎం.టీ. ఎరువులను అందుబాటులో ఉంచారు. సాగు కాలంలో ఎరువుల కొరత తలెత్తకుండా ఆయా నెలల అవసరాలకు అనుగుణంగా ముందుగానే ఎరువులను సిద్ధం చేయనున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



జిల్లాలో ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అన్నీ ముందుగానే సిద్ధం చేశాం. గ్రామాల్లోని ఆర్‌బీకేలు, సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉంచాం. పంట చివర్లో తుపాన్ల బెడద లేకుండా రైతులు త్వరితగతిన నాట్లు, వెదజల్లు సాగు పూర్తిచేయాలి.

– ఓలేటి బోసుబాబు, వ్యవసాయశాఖ జేడీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఎవరు చదివిందేమిటో ప్రజలకు తెలుసు

- చదివిన కోర్సులపై కన్‌ఫ్యూజ్‌గా చెప్పగల ఘనుడు పవన్
- వారాహి వాహనానికి వరాహి... నారాహి పేర్లే కరెక్ట్
- ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు బాబి



జిన్నూరి బాబి

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్ తన వాహనాన్ని వారాహికి బదులు వరాహి అన్నారని ఆయనపై విమర్శల చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తన చదువు గురించి పలు సందర్భాల్లో ఏమి చెప్పాడో గుర్తుకు తెచ్చుకోవాలని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. ముఖ్యమంత్రి జగన్ వరాహి అనడంలో నిగూఢమైన అర్థం దాగి ఉందని చెప్పారు. అమలాపురంలో బాబి గురువారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. ఎవరెవరు ఎంతెంత వరకూ చదివారో ప్రజలకు తెలుసునని చెప్పారు. ఎంబీఏ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేసే పవన్ కల్యాణ్... తాను పలు సందర్భాల్లో ఓ సారి సీఈసీ, మరోసారి ఎంఈసీ, ఇంకోసారి డిప్లమా ఇన్ ఎల్రక్టానిక్స్ చదివానని నిలకడ లేని ప్రసంగాలు చేశారని బాబి గుర్తు చేశారు. తాను చదివిన కోర్సులను కన్‌ఫ్యూజ్‌గా చెప్పడంలో పవన్ కల్యాణ్ ఘనుడని పేర్కొన్నారు. వారాహి వాహనాన్ని కడియానికి చెందిన ఓ ప్రముఖుడు పవన్‌కు వరంగా ఇచ్చాడు కాబట్టే ఆ వాహనాన్ని ముఖ్యమంత్రి జగన్ వరాహి అన్నారని బాబి స్పష్టం చేశారు. ఒంట్లో బాగోలేక పోయినా జగన్ ప్రతిపక్ష నేతగా తన పాదయాత్రను అప్పట్లో విశ్రాంతి అనేది లేకుండా కొనసాగించారని గుర్తు చేశారు. అయితే పవన్ అనారోగ్యం కారణంగా వారాహి యాత్రను రెండు రోజులు నిలిపివేసినట్లు చెబుతున్నా ఆయన 'బ్రో' చిత్రానికి డబ్బింగ్ చెప్పేందుకు మాత్రం ఆరోగ్యం బాగుందని బాబి ఎద్దేవా చేశారు. వారాహి అంటే ఓ దేవత పేరు... పవిత్రమైన పేరు పెట్టిన వాహనంపై తనతో పాటు తన సెక్యూరిటీ సిబ్బంది బూటు కాళ్లతో అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. వారాహి వాహనానికి ఎవరో వరమిస్తే బహుమానంగా వచ్చింది కాబట్టి ఓ పక్క వరాహి, చంద్రబాబు కన్నుసన్నల్లోనే యాత్ర సాగుతుంది కాబట్టి నారాహి పేర్లు పెడితేనే కరెక్ట్‌గా ఉంటుందని బాబి సలహా ఇచ్చారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బక్రీద్ (ఈద్ ఉల్ జుహా)ను ప్రత్యేక ప్రార్థనలతో మూడు మసీదుల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లిం పెద్దలు, చిన్నలు స్నానాలు ఆచరించి అల్లాహో అక్బర్ అంటూఊరేగింపుగా మసీదులకు చేరుకుని మత గురువులను అనుసరించి ఈద్ నమాజ్‌లను చేశారు. హజ్ యాత్రకు వెళ్లిన వారి గురించి దువా(వేడుకోలు) చేశారు. ద్రాక్షారామ షియా జామియా జాఫ్రి మసీదులో మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్, మార్కెట్‌లోని జామియా మసీదులో మత గురువు మహ్మద్ తసదుక్ హుస్సేన్, వెలంపాలెంలోని షాబాజియా మసీదులో మత గురువు ఎండీ తౌసిఫ్ రజా భక్తులకు తండ్రీ, కొడుకులు హజరత్ ఇబ్రహీం, హజరత్ ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని సవివరంగా తెలిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ఫాతీహా ఇచ్చి మళ్లీ ఊరేగింపుగా మసీదులకు చేరుకుని తేనీటి విందులో పాల్గొన్నారు. ఉదయం నుంచే తమ ఇళ్ల వద్ద ఖుర్బానీ ఇచ్చి చుట్టుపక్కల వారికి పంచి పెట్టుకున్నారు. మసీదులలో ఈద్ నమాజ్‌లను చదివించారు.



ద్రాక్షారామ షియా జామియా జాఫ్రి మసీదులో ఈద్ ప్రసంగం చేస్తున్న మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్



ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

అంతర్వేదిలో భక్తజన సందోహం

సఖినేటిపల్లి: తొలి ఏకాదశి, స్వామివారి జన్మ నక్షత్రం స్వాతికి కలిసి రావడంతో గురువారం అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అర్చకులు నిర్వహించిన స్వాతి నక్షత్ర విశేష అభిషేకం, నారసింహ సుదర్శన హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, సాధారణ దర్శనంలో సుమారు 5 వేల మంది పాల్గొన్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. విశేష అభిషేకంలో 62 మంది, సుదర్శన హోమంలో 116 మంది పాల్గొన్నట్టు కూడా ఆయన చెప్పారు.

ఘనంగా జన్మ నక్షత్రం పూజలు

ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్ర జలాలను ఆలయ అర్చకులు వేదమంత్ర పఠనాలతో 108 కలశల్లోకి ఉంచి, జలాల్లోకి శ్రీ స్వామివారిని మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. సర్వదేవతలను కలశల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో, వేద మంత్రోచ్చరణల మధ్య స్వామికి అభిషేకం చేశారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నాలుగున్నర గంటలకు స్వామివారికి మూలమంత్ర సహిత ఐశ్వర్యలక్ష్మి హోమం, అర్చన అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. అష్టోత్తర పూజలు, కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించారు. ఏర్పాట్లను చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు. ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ప్రత్యేక ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అదనపు గ్రాంటుకు అప్రోచ్

- గోదావరి పాయపై రూ.2 కోట్లతో పూర్తయిన కాజ్ వే
- మరో రూ.కోటితో అప్రోచ్ రోడ్లకు ప్రతిపాదనలు

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంక గ్రామానికి పోయే మార్గంలోని బాడిరేవు(గోదావరి పాయ)పై నిర్మించిన కొత్త కాజ్ వే కు అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బీ శాఖ ఇటీవల రూ.కోటితో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. ఎత్తు తక్కువలో ఉండి, శిథిల స్థితికి చేరుకున్న ఈ కాజ్‌వే స్థానే కొత్త కాజ్ వే నిర్మాణం గత నెలాఖరు నాటికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్లతో అధికారులు పూర్తి చేశారు. అయితే కాజ్ వేకు అటు అప్పనరాముని లంక, ఇటు టేకిశెట్టిపాలెం వైపులకు అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అదనపు గ్రాంటు కోసం పై అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేసింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి అప్రోచ్ మార్గాలపైనే వాహనదారులు, అంతర్వేది పుణ్యక్షేత్రానికి భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఆగస్టు నాటికి సిద్ధం చేయాలని వినతి...

ఏటా ఏటిగట్టు అనుకుని ఉన్న దిగువన గ్రామాలకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల మధ్య వరదలు రావడం పరిపాటి. మండలంలో ఏటిగట్టుకు దిగువన వశిష్ట గోదావరి తీరం వెంబడి టేకిశెట్టిపాలెం కొంత భాగం, అప్పనరాముని లంక, సఖినేటిపల్లి లంక గ్రామాలు పూర్తిగాను వరద ముంపులో పూర్తిగా చిక్కుకుంటాయి. అయితే ఇక్కడ నిర్మించిన కొత్త కాజ్ వే టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాలను అనుసంధానం చేస్తుంది. ఈ రెండు గ్రామాల ప్రజలతో పాటు, ఇతర గ్రామాల ప్రజలకు, ప్రధానంగా అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు కొత్త కాజ్ వే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే వరదలు వచ్చే సమయానికి ఈ కొత్త కాజ్ వేకు అప్రోచ్ రోడ్లను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పై రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. దీనివల్ల ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరికను దాటి రెండో వరద ప్రమాద హెచ్చరిక జారీ చేసే వరకూ వంతెనపై భక్తుల రాక పోకలకు, ప్రధానంగా అప్పనరామునిలంక ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వరద సమయంలో బాధితులకు సహాయం అందజేసే వాహనాల రాకపోకలకు ఈ కాజ్ వే ఎంతో ఉపయోగిస్తుందని వారు తెలిపారు.



టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయపై నిర్మించిన కొత్త కాజ్ వే



కాజ్ వేకు టేకిశెట్టిపాలెం వైపు తాత్కాలికంగా మట్టితో నిర్మించిన అప్రోచ్ మార్గం

కాజ్ వేను పరిశీలించిన కలెక్టర్

టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంక గ్రామానికి పోయే మార్గంలో గోదావరిపాయ(బాడిరేవు)పై రూ.2 కోట్లతో రూపుదిద్దుకుంటున్న కాజ్ వేను కలెక్టర్ హిమాన్షుశుక్లా ఇటీవల పరిశీలించారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో కాజ్ వేను సందర్శించారు. కాజ్ వేకు రెండు వైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసేలా చూడాలని కలెక్టర్‌కు, ఎంపీపీ వీరా మల్లిబాబు విజ్ఞప్తి చేశారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం వల్ల వరదల సమయంలో రాకపోకలకు ప్రయాణికులకు ఆటంకం ఉండదని, వరదల సమయంలో బాధితులకు సత్వర సహాయక చర్యలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఎంపీపీ, కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

ప్రభుత్వానికి పంపాం

కాజ్ వేకు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిమిత్తం రూ.కోటి అంచనాల వ్యయంతో పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. నిధులు వచ్చిన వెంటనే టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల వైపు అప్రోచ్ రోడ్లను నిర్మిస్తాం.

– సురేష్, ఆర్‌అండ్‌బీ, జేఈ, రాజోలు

నిత్యాన్నదాన పథకానికి రూ.1,50,049 విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేట వాస్తవ్యులు చొల్లంగి మధు సంజీవ్ కుటుంబ సభ్యులు రూ.50,000, మండపేట వాస్తవ్యులు బెల్లంకొండ వెంకట్రావు రూ.50,049, అంబాజీపేట మండలం ముక్కామల గ్రామ వాస్తవ్యులు సురుకుచి సారధి రూ.50,000 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజుకు అందజేశారు. దాతలను వేదపండితులు వేఆశీర్వదించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వేంకటేశ్వర్లు దంపతులు గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. ఈఓ అజాద్ దంపతులు స్వామివారి ప్రసాదాలను అందచేశారు.

క్లుప్తంగా

ఆడిట్ గడువు పెంచండి

- సొసైటీలకు నేటితో ముగియనున్న ఫైనం
- జూలై 15 వరకు పెంచాలని తీర్మానం



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం

సాక్షి అమలాపురం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) గత ఆర్థిక సంవత్సర ఆడిట్‌ను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులు సంఘాలలో కలకలం సృష్టిస్తున్నాయి. సెక్షన్ 50 (4) ఆఫ్ ఏపీసీఎస్ 1964 ప్రకారం ఈ నెలాఖరు నాటికి ఆడిట్ పూర్తి చేయాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలాఖరు వరకు ఆడిట్ పూర్తి చేసేందుకు గడువు ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది అసాధారణంగా జూన్ నెలాఖరు నాటికి ఆడిట్ పూర్తి చేయమనడంతో పీఏసీఎస్‌ల అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ పరిధిలో మొత్తం 302 సంఘాలు ఉన్నాయి. గడువు తగ్గించడం వల్ల చాలా సంఘాలలో ఆడిట్ పూర్తికాలేదు. బుధవారం కాకినాడలో జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభలో పీఏసీఎస్ చైర్మన్‌లు, సీఈవోలు గడువు కావాలని పట్టుబట్టారు. మహాజన సభ ఆడిట్ పూర్తి చేసేందుకు జూలై 15 వరకు గడువు పెంచాలని తీర్మానం చేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ప్రభుత్వం అనుమతిస్తే ఆడిట్ పూర్తి చేసేందుకు గడవు లభించనుంది.

మనస్థాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

మామిడికుదురు: కొడుకు తనను వేరే ఇంట్లో ఉంచాడన్న మనస్థాపంతో మొగలికుదురు గ్రామానికి చెందిన బిళ్ల సరస్వతి (82) ఆత్మహత్య చేసుకుందని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ రాత్రి నుంచి సరస్వతి కనిపించడం లేదంటూ ఆమె మనమడు ధర్మతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట అదృశ్యం కేసు నమోదు చేశామన్నారు. 28వ తేదీన ఆమె ఇంటి పక్కనే ఉన్న పంట కాలువలో శవమై కనిపించిందని ఎస్సై చెప్పారు. ఇంట్లో తన మాటే చెల్లుబాటు కావాలని, కొడుకు తనను ఇంట్లో కాకుండా వేరే ఇంట్లో ఉంచాడన్న మనస్థాపంతో ఇంటి పక్కనే ఉన్న పంట కాలువలో దూకి సరస్వతి ఆత్మహత్య చేసుకుందన్నారు. పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

రోజుకో పదం.. అందుకో ఆంగ్ల పథం

- ఇంగ్లిషు అభ్యసనే లక్ష్యంగా ముందుకు
- ప్రతి 15రోజులకు ఒకసారి విద్యార్థులకు పరీక్ష
- పక్కాగా అమలుకు విద్యాశాఖ ఆదేశాలు



రాయవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల పదాలు నేర్పిస్తున్న టీచరు సత్యనారాయణమ్మ

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంకు ప్రాధాన్యం పెరిగింది. గతంలో కేవలం ఉన్నత పాఠశాలల్లో సక్సెస్ స్కూళ్లలో మాత్రమే ఇంగ్లిషు మీడియం ఉండగా, ఇప్పుడు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కూడా పూర్తి స్థాయిలో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లిషుపై విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టేందుకు 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసింది. ఈ ఏడాది కూడా అమలుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి పాఠశాలల్లో 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి రోజూ ఆంగ్ల పదాలను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. అయితే విద్యార్థులు 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే'లో ఆంగ్ల పదాలు ఎంతవరకు నేర్చుకున్నారు? ఏ మేరకు పదాలను అవగాహన చేసుకున్నారన్న విషయం తెలుసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రతి 15 రోజులకు ఒకసారి పరీక్షను కూడా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం వలన విద్యార్థులకు రీడింగ్, రైటింగ్ స్కిల్స్ అభివృద్ధి చెందుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నాలుగు దశల్లో..

ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీలోనే 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రోగ్రామ్‌లో ఆరోజు చెప్పాల్సిన పదాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్నారు. అనంతరం ఫస్ట్ పీరియడ్‌లో విద్యార్థులకు కేటాయించిన నోట్సులో పదాలను రాయిస్తున్నారు. ఆ పదాలతో సొంత వాక్యాలను తయారు చేసి వారితో చదివిస్తున్నారు. ఒకటి, రెండు తరగతులను ఒకటవ స్థాయి, 3,4,5 తరగతులను రెండు, 6,7,8 తరగతులను మూడు, 9,10 తరగతులను నాల్గవ స్థాయిగా విభజించారు. ప్రతి రోజూ కొన్ని పదాలను విద్యార్థులకు చెప్పి సాధన చేయించారు. తొలి దశలో పదాల ఉచ్చారణ, మౌఖిక అభ్యాసం, రెండవ దశలో స్పెల్లింగ్ గేమ్, మూడవ దశలో డిక్షనరీ సహకారంతో భాషాభాగాల గుర్తింపు, నాల్గవ దశలో సమాన అర్థాలను, వ్యతిరేక పదాలను కనుగొనడం నేర్పిస్తున్నారు. ప్రతిరోజూ ఒక పదాన్ని బోర్డుపై రాసి, విద్యార్థులతో రాయిస్తున్నారు. ఈ కార్యక్రమం నిమిత్తం 100 పేజీల పుస్తకాన్ని కేటాయించారు. ప్రతి 15రోజులకు ఒకసారి విద్యార్థులు సాధన చేసిన పదాలపై స్పెల్ బీ పేరుతో డిక్టేషన్ నిర్వహిస్తున్నారు. ఫలితాలను మదింపు చేసి విద్యార్థులకు అవసరమైన సూచనలు ఇస్తున్నారు.

1,588 పాఠశాలల్లో..

లెర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం ఈ నెల 19 నుంచి ప్రారంభం కాగా, విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద 1,275 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, 235 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 1,2 తరగతులు 32,658 మంది, 3,4,5 తరగతులు 65వేలు, 6,7 తరగతులు 44,561 మంది, 8,9,10 తరగతులు 61,795 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

చాలా ప్రయోజనం



'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రోగ్రామ్ విద్యార్థులకు చాలా ప్రయోజనకరం. ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఈ విధానం చక్కని మార్గం. విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు డిక్షనరీలు కూడా అందజేశాం. ఆంగ్లభాషా పదాలపై పట్టు, మాట్లాడే నైపుణ్యం పెంపొందించుకునేందుకు డిక్షనరీల వినియోగం ఉపకరిస్తుంది.

– జి.నాగమణి, ప్రాంతీయ సంయుక్త తనిఖీ అధికారి, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

పర్యవేక్షణలో భాగం చేశాం



పాఠశాలల్లో విద్యార్థులు ప్రతి రోజూ ఒక ఆంగ్ల పదం నేర్చుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాఠశాలల్లో అమలు చేస్తున్నాం. ప్రతి పర్యవేక్షణ అధికారి 'లెర్న్ ఎ వర్డ్ ఎ డే' కార్యక్రమం అమలును తనిఖీ చేసేలా పర్యవేక్షణలో భాగం చేశాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, కోనసీమ జిల్లా

టిడ్కో భవనాల వద్ద రూ.25 లక్షల ఐరన్ చోరీ

కేసు నమోదు

అల్లవరం: అమలాపురం పట్టణ ప్రజలకు అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద అదనపు లే అవుట్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఐరన్‌ని హౌసింగ్ శాఖకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చోరీ చేసినట్టు గుర్తించారు. అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి 46 టన్నుల 100 కేజీల ఇనుము హౌసింగ్ అధికారులు దిగుమతి చేశారు. నాలుగు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న అంబాజీపేట మండలం పొలగుమ్మి గ్రామానికి చెందిన సరెళ్ల ఏడుకొండల వెంకటరమణ తరుచుగా ఆ ఇనుము చోరీకి పాల్పడ్డాడు. హౌసింగ్ అధికారులకు అనుమానం వచ్చి లెక్కించగా 36 టన్నుల 190 కేజీల ఐరన్ చోరీ జరిగినట్లు గుర్తించారు. కేవలం 99 కేజీల ఐరన్ మాత్రమే మిగిలినట్లుగా అధికారులు లెక్కలు తేల్చారు. చోరీ చేసిన ఐరన్ ఖరీదు రూ.25 లక్షల 34 వేలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ చోరీపై అమలాపురం మున్సిపల్ హౌసింగ్ అధికారి శ్రీధర్ అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో అల్లవరం ఎస్సై ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అమలాపురంలో 'వేగ' ఆభరణాల ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఆర్య వైశ్య సంఘ అధ్యక్షురాలు సీతా మహాలక్ష్మి

అమలాపురం టౌన్: విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో బంగారు, వజ్రాభరణాల షోరూంలను నిర్వహిస్తున్న వేగ జ్యూయలర్స్ సంస్థ అమలాపురంలోని హోటల్ గ్రాండ్ పార్క్‌లో రెండు రోజులపాటు బంగారు ఆభరణాల ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన, అమ్మకాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు యెండూరి సీతా మహాలక్ష్మి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన, అమ్మకాలు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు ఉంటాయని వేగ సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, సుధాకర్ తెలిపారు. వేడుకలు, వివాహాది కార్యక్రమాలకు కావాల్సిన విశిష్ట ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉంచామని చెప్పారు. రూ.రెండు లక్షల బంగారం, వజ్రాల కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. పోల్కీ జ్యూయలరీపై ఎలాంటి మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవని చెప్పారు. ఆభరణాల ప్రియులు ఈ రెండు రోజుల ప్రదర్శన, అమ్మకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇల వైకుంఠంలా రత్నగిరి



సత్యదేవుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



దర్బారు మంటపంలో భక్తుల సందడి

- దర్బారు మంటపంలో విష్ణుమూర్తిగా సత్యదేవుడు
- వేలాదిగా స్వామివారిని దర్శించిన భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి దర్బారు మంటపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన నిలువెత్తు విష్ణుమూర్తి భక్తులకు దర్శనమిచ్చి ఇల వైకుంఠం లా రత్నగిరి ప్రకాశించింది. నాలుగు భుజాలు కలిగి వాటిలో శంఖు చక్రాలు, గద, శార్ఙం ధరించి వక్షస్థలం లో మహాలక్ష్మి తో విష్ణుమూర్తి భక్తులను అలరించారు.

దర్బారు మంటపంలో సత్యదేవుని ఉత్సవమూర్తుల దర్శనాలు ప్రారంభం

విశాలంగా, వాస్తుకు అనుకూలంగా తీర్చిదిద్దిన దర్బారు మంటపంలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తుల దర్శనం తొలి ఏకాదశి, గురువారం ఉదయం నుంచి ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఎనిమిది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఒకవైపు నిలువెత్తు విష్ణుమూర్తి, మరోవైపు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీ కారణంగా సత్యదేవుని గర్భాలయంలో సత్యదేవుడు, అమ్మవారిని ఎక్కువ సేపు తిలకించే అవకాశం లేని భక్తులు దర్బారు మంటపంలో స్వామి, అమ్మవార్లను చాలాసేపు తిలకించారు. స్వామివారిని దర్శించిన భక్తులకు రవ్వ కేసరి ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దర్బారు మంటపంలో విష్ణుమూర్తి, సత్యదేవుడు, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు.

మహిళల లలితా, విష్ణు సహస్రనామ పారాయణ

దర్బారు మండపంలో సత్యదేవుడు, అమ్మవారి పాదాల చెంత మహిళలు లలిత, విష్ణు సహస్ర నామావళి పారాయణం చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరభట్ల గంగబాబు, శివ, యనమండ్ర శర్మ, పురుషోత్తం, రమేష్, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్శింహమూర్తి, అర్చకులు దత్తాత్రేయశర్మ, సుధీర్, రామ్‌కుమార్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యదేవుని ఆలయం, దర్బారు మంటపం, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



దర్బారు మంటపంలో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన విష్ణుమూర్తి

స్వాహా సొమ్ము లెక్క తేల్చారు

వీవోఏపై కేసు నమోదు



కొంకాపల్లి యూనియన్ బ్యాంకులో విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

అమలాపురం రూరల్: పేరూరులో డ్వాక్రా సంఘాల నుంచి బ్యాంకు సేవా కేంద్రం ద్వారా కట్టించుకున్న రుణాల సొమ్ములో రూ.44.89 లక్షలు ఓ వీవోఏ స్వాహా చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు లెక్క తేల్చారు. ఈ ఘటనపై డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అమలాపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 30 స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెందిన స్త్రీనిధి, బ్యాంక్ రుణాల వాయిదాల సొమ్ములో రూ.44.89 లక్షలను పేరూరు పంచాయతీ చింతపల్లిపాలెం గ్రామ సంఘం వీవోఏ కనకదుర్గ స్వాహా చేసినట్లు అధికారులు విచారణలో తేల్చారు. ఆయా సంఘాల సభ్యుల రుణాల వాయిదాలు ముగిసినా అప్పు తీరకపోవడంతో బ్యాంక్ అధికారుల నుంచి వారిపై ఒత్తిడి పెరిగింది. దీంతో బాధిత డ్వాక్రా సంఘాల సభ్యులు ఇటీవల స్పందనలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని ఆయన ఆదేశించారు. డీఆర్‌డీఏ అధికారులు కొంకాపల్లి యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌తో కలసి అక్కడ లెక్కలు తేల్చారు. పేరూరులో మహిళా సంఘాల బ్యాంకు పుస్తకాలను పరిశీలించి వారి వద్ద నుంచి వివరాలు తీసుకున్నారు. వీవోఏ కనకదుర్గ సుమారు రూ.44.89 లక్షలు వాడుకున్నట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో కనకదుర్గపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ చెప్పారు.

ఆసక్తికర విషయాలెన్నో..: పేరూరులో రామాంజనేయ సంఘం నుంచి రూ.1.50 లక్షల శ్రీనిధి సొమ్మును వీవోఏ తన పెద్ద కుమార్తె అకౌంట్‌కు రూ.లక్ష, రెండో కుమార్తెకు రూ.50 చొప్పున వేసింది. మళ్లీ ఆ మొత్తాన్ని గూగుల్ పే ద్వారా ఓ అల్లుడి ఖాతాకు వేసినట్లు అధికారులు నిర్ధారించారు. వీవోఏ తన స్వైపింగ్ (నగదు బదిలీ మెషీన్) ద్వారా కూడా సంఘం సొమ్మును నచ్చిన వారి ఖాతాలకు జమ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది.

దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు

కొత్తపేట: పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరిపై, నలుగురు వ్యక్తులు దాడి చేసి దుర్భాషలాడిన ఘటనలో రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ, రావులపాలెం సీఐ రజనీకుమార్ గురువారం తెలిపారు. 2015 జనవరి 29వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో కొత్తపేట మండలం పలివెల గ్రామం చిన్నపేటకు చెందిన నక్క రాజేష్, గొల్లపల్లి శ్రీను కలిసి ఆటోలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. చిన్నపేట సమీపంలో పలివెల, శేరేపాలెంకు చెందిన మల్లవరపు కనకరాజు అలియాస్ బాబీ, మల్లవరపు నాగభూషణం అలియాస్ బొజ్జికాపు, మల్లవరపు అర్జునరావు, మల్లవరపు శ్రీను అలియాస్ పచ్చళ్ళ శ్రీను వారిని ఆపి వారిపై దుర్భాషలాడుతూ కులం పేరుతో తిట్టి కర్రలు, డ్రింక్ బాటిల్స్‌తో దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటనపై అప్పటి ఏఎస్ఐ ఎ.గారగారావు కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ ఎల్.అంకయ్య దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదన అనంతరం ముద్దాయిలైన కనకరాజు, నాగభూషణం, అర్జునరావుకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ జడ్జి ఎం.నాగేశ్వరావు తీర్పునిచ్చారన్నారు. ఈ కేసులో నాలుగో ముద్దాయి శ్రీను అలియాస్ పచ్చళ్ళ శ్రీను వాదనల సమయంలో మృతి చెందినట్టు తెలిపారు.

ఎంఈవో-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రాయవరం: మండల విద్యాశాఖాధికారి పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో-1 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎంఈవో-1 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్లకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. ఆయా రీజియన్ పరిధిలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల నుంచి నియామకాలు చేపట్టాల్సి ఉంది. 1:2 రేషియో ప్రకారం సీనియారిటీ జాబితాను తయారు చేస్తారు. శుక్రవారం సీనియారిటీ జాబితాను తయారు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 2వ తేదీన పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌లో ఎంఈవో-1 కోరుకున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు జూలై 3న వారు కోరుకున్న మండలాల్లో చేరాల్సి ఉంటుంది. రీజియన్-2 పరిధిలో 99 ఎంఈవో పోస్టులు ఖాళీలుండగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 27 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

జనం లేక బస్సుయాత్ర వెలవెల

- కానరాని తెలుగు తమ్ముళ్ల సందడి
- చంద్రబాబును నమ్మని ప్రజలు



రాజమహేంద్రవరంలోని సీతంపేట వద్ద కార్యకర్తలు లేక వెలవెలబోతున్న బస్సుయాత్ర

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో తెలుగుదేశం నాయకులు నగరంలో గురువారం చేపట్టిన బస్సుయాత్ర వెలవెలబోయింది. బస్సుయాత్రతో నగరంలో తెలుగుదేశం క్యాడర్ బలాన్ని చూపిద్దామనుకున్న నాయకులకు చుక్కెదురైంది. అట్టహాసంగా ప్రారంభించిన ఈ యాత్రలో తెలుగు తమ్ముళ్ల సందడి కానరాలేదు. గురువారం ఉదయం చైతన్య యాత్ర రథానికి పేపరు మిల్లు ఎదురుగా ఉన్న 45వ డివిజన్‌లో వాంబే గృహాల వద్ద దిష్టి తీసి పూజలు చేసి ప్రారంభించారు. పార్టీ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి అప్పారావు, కేఎస్ జవహర్, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, పెందుర్తి వెంకటేష్, ఆదిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు. పుష్కరాల రేవు, వై.జంక్షన్ బీసీ బాలుర వసతి గృహం, కంబాల చెరువు నుంచి స్వతంత్ర ఆసుపత్రి మీదుగా మూలగొయ్యి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీని నిర్వహించారు. బస్సుకు ముందు కొన్ని బైక్‌లతో కార్యకర్తలు సాగారు.

టీడీపీకే గ్యారంటీ లేదు

చంద్రబాబు, టీడీపీతో పెట్టుకుంటే భవిష్యత్తుకు గ్యారంటీ లేదని జనం అనుకుంటున్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ హవా కొనసాగితే రాజమహేంద్రవరం అర్బన్‌లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. మూడుసార్లు నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆ దీమాతోనే అర్బన్‌లో తమకు ఎదురులేదని భావిస్తున్న టీడీపీకి ఈ బస్సుయాత్ర చేదు ఫలితం మిగిల్చింది. యాత్ర కాస్తా తుస్సుమనడంతో నాయకులు డీలా పడ్డారు. మూలగొయ్యిలో బహిరంగ సభకు జన సమీకరణ చేసి నడిపించారు.

దాడి కేసు నమోదు

వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడిపై దాడి చేసిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలి భర్త



చికిత్స పొందుతున్న శ్యాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: దిండి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవ శ్యాంబాబుపై ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు తాడి దుర్గ భర్త తాడి సురేష్ బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. తీవ్రగాయాల పాలైన శ్యాంబాబు రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 28వ తేదీ రాత్రి దిండి గ్రామంలో తన ఆటోలో కూర్చుని ఫోన్‌లో మాట్లాడుతున్న శ్యాంబాబుపై తాడి సురేష్ అకస్మాత్తుగా బీరుబాటిల్‌తో తలపై కొట్టి గాయపర్చాడు. తలకు బలమైన గాయం కావడంతో శ్యాంబాబును రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మలికిపురం ఎస్సై సురేంద్ర తెలిపారు. రాజోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్యాంబాబును ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరామర్శించారు.